# ఎకో టూరిజానికి ప్రణాళికలు సిద్ధం చేయాలి

- అటవీ, పర్యాటక శాఖలు సమన్వయంతో పని చేయాలి
- అటవీశాఖపై సమీక్షలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

హైదరాబాద్, మార్చి 15 (నమస్తే తెలంగాణ) : రాష్ట్రంలో జీవవైవిధ్యం, హెరిటేజ్ ప్రదేశాలు, సంస్కృతికి అద్దం పట్టే ప్రాంతాలను గుర్తించి ఎకో టూరిజం అభివృద్ధికి ప్రణాళికలు రూపొందించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అటవీ, పర్యాటక శాఖ అధికారులను ఆదేశించారు. శుక్రవారం సచివాలయంలో అటవీశాఖ మంత్రి కొండా సురేఖతో పాటు అటవీశాఖ అధికారులతో సీఎం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉత్తర తెలంగాణలో కవ్వాల్, దక్షిణ తెలంగాణ వైపు అమ్రాబాద్ టైగర్ రిజర్వు ప్రాజెక్టులను పర్యాటక ప్రాంతాలుగా తీర్చిదిద్దేందుకు ఉన్న అవకాశాలను పరిశీలించాలని సూచించారు. అటవీ శాఖ నుంచి డిప్యూటేషన్‌పై వెళ్లిన ఉద్యోగుల వివరాలను వెంటనే సమర్పించాలని, అవసరమైతే వారిని వెనక్కి రప్పించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. కరీంనగర్, వరంగల్, ఖమ్మం నగరాలకు అందుబాటులో ఉండేలా సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్, విద్యుత్తు ఉత్పత్తి ప్లాంట్లు ఏర్పాటు చేసేందుకు అనువైన ప్రాంతాలను గుర్తించాలన్నారు. సింగిల్ యూజ్డ్ ప్లాస్టిక్ వాడకాన్ని నియంత్రించేందుకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలన్నారు. రాష్ట్రంలోని నర్సరీల్లో దాదాపు 22 కోట్ల మొక్కలు అందుబాటులో ఉన్నాయని అధికారులు సీఎంకు నివేదించగా, వానకాలం ఆరంభంలో నాటేందుకు ఏర్పాట్లు చేయాలని, కేంద్రం నుంచి వచ్చే కాంపా నిధులను సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు. సమీక్షలో అటవీశాఖ ముఖ్య కార్యదర్శి వాణీ ప్రసాద్, ఫారెస్ట్ చీఫ్ కన్జర్వేటర్ డోబ్రియాల్, సీఎంవో ముఖ్య కార్యదర్శి శేషాద్రి, సీఎం కార్యదర్శి చంద్రశేఖర్ రెడ్డి, అధికారులు పాల్గొన్నారు.



శుక్రవారం సచివాలయంలో అటవీశాఖ అధికారులతో నిర్వహించిన సమీక్ష సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డికి మొక్కను అందజేస్తున్న ఆ శాఖ మంత్రి కొండా సురేఖ

## వందరోజుల్లో అనేక విజయాలు సాధించాం

### రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి

హైదరాబాద్, మార్చి 15 (నమస్తే తెలంగాణ): రాష్ట్ర ప్రభుత్వం ఏర్పడిన వంద రోజుల్లోనే అనేక విజయాలు సాధించామని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి శుక్రవారానికి వంద రోజులు పూర్తి చేసుకున్న సందర్భంగా ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన వాగ్దానాలు తూచ తప్పకుండా అమలుచేస్తూ విజయవంతంగా ముందుకు సాగుతున్నదని పేర్కొన్నారు. ఈ సందర్భంగా వందరోజుల్లో తాము సాధించిన విజయాలంటూ పలు అంశాలను పేర్కొన్నారు.

## • నేతన్నల దీక్షకు బీఆర్‌ఎస్ సంఘీభావం



వస్త్ర ఉత్పత్తుల ఆర్డర్లు ఇచ్చి నేతన్నలకు ఉపాధి కల్పించాలని బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు జిందం చక్రపాణి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని చేనేత జౌళిశాఖ కార్యాలయం వద్ద 11 రోజులుగా ఆసాములు దీక్ష చేస్తుండగా, శుక్రవారం బీఆర్‌ఎస్ నాయకులు సంఘీభావం తెలిపారు.
– రాజన్న సిరిసిల్ల, నమస్తే తెలంగాణ

## • మంచి నీళ్ల కోసం రోడ్డెక్కిన మహిళలు



భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని 20వ వార్డు శాంతినగర్‌లోని దళిత కాలనీ ప్రజలు శుక్రవారం మంచి నీటి కోసం రోడ్డెక్కారు. ఖాళీ బిందెలతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా కాలనీ మహిళలు మాట్లాడుతూ.. తమ కాలనీకి నాలుగు రోజులకో సారి కూడా తాగు నీరు రావడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. - కృష్ణకాలనీ

## • తాగునీటి కోసం ఖాళీ బిందెలతో నిరసన



మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని పలు కాలనీల్లో మంచినీటి సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేస్తూ సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ నాయకులు శుక్రవారం స్థానికులతో కలిసి ఖాళీ బిందెలతో ర్యాలీ నిర్వహించారు. అనంతరం మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా చేసి కమిషనర్ నోముల రవీందర్ యాదవ్‌కు వినతిపత్రం సమర్పించారు. – మహబూబాబాద్



## ఫ్లోటింగ్ ప్లాంట్‌కు ఇంటర్నేషనల్ ఎనర్జీ అవార్డు

పెద్దపల్లి జిల్లా రామగుండం ఎన్టీపీసీ రిజర్వాయర్‌లోని 100 మెగావాట్ల ఫ్లోటింగ్ సోలార్ ప్లాంట్‌కు ఇంటర్నేషనల్ సోలార్ ఎనర్జీ అవార్డు లభించింది. శుక్రవారం హైదరాబాద్‌లో సౌర ఎనర్జీ గ్రూప్ ఎడిటర్ ప్రసన్న సింగ్ రామగుండం ఎన్టీపీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కేదార్ రంజన్‌పాండుకు పురస్కారం ప్రదానం చేశారు. - జ్యోతినగర్

## సీఎంను కలిసిన ఎమ్మెల్యే దానం, ఎంపీ పసునూరి

హైదరాబాద్, మార్చి 15 (నమస్తే తెలంగాణ): ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని శుక్రవారం వరంగల్ ఎంపీ పసునూరి దయాకర్, ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ వేర్వేరుగా కలిశారు. మంత్రి కొండా సురేఖతో కలిసి సచివాలయంలో ఎంపీ పసునూరి దయాకర్ కలువగా, ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ సీఎం నివాసంలో రేవంత్‌ను కలిశారు. దానం నాగేందర్ సీఎంను కలిసిన సందర్భంగా ఏఐసీసీ రాష్ట్ర ఇన్‌చార్జి దీపా దాస్ మున్షీ, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి కూడా ఉన్నారు.

## కోటాకు మించి నీటిని వాడారు

### తెలంగాణ సర్కారుకు కేఆర్‌ఎంబీ లేఖ

హైదరాబాద్, మార్చి 15 (నమస్తే తెలంగాణ): శ్రీశైలం, నాగార్జునసాగర్ జలాశయాల నుంచి తెలంగాణ ఇప్పటికే కోటాకు మించి 4.73 టీఎంసీల నీటిని వాడుకున్నట్టు కృష్ణా నదీ యాజమాన్య బోర్డు (కేఆర్‌ఎంబీ) వెల్లడించింది. అక్టోబర్‌లో జరిగిన త్రిసభ్య కమిటీ సమావేశ నిర్ణయం ప్రకారం తెలంగాణకు 35 టీఎంసీలను కేటాయించగా.. ఇప్పటికే సాగర్ నుంచి 15.38 టీఎంసీలు, శ్రీశైలం నుంచి 26.57 టీఎంసీలను వినియోగించుకున్నట్టు వివరించింది. ఈ మేరకు రాష్ట్ర సాగునీటి పారుదలశాఖ కార్యదర్శి రాహుల్ బొజ్జాకు లేఖ రాసింది. తెలంగాణ తాగునీటి అవసరాల కోసం ఈ ఏడాది మే చివరి వరకు 8.90 టీఎంసీలు అవసరమవుతాయని, క్యారీఓవర్ స్టోరేజీ, తాగునీటి కేటాయించిన జలాల్లో 20 శాతాన్ని మాత్రమే పరిగణనలోకి తీసుకుని ఆ మేరకు నీటిని విడుదల చేయాలని రాష్ట్ర ప్రభుత్వం కోరడంతో కేఆర్‌ఎంబీ సభ్య కార్యదర్శి డీఎం రాయపురే ఈ లేఖను రాశారు. క్యారీఓవర్ స్టోరేజీ అంశాన్ని ట్రిబ్యునల్‌కు అప్పగించామని, తాగునీటి వినియోగంలో 20 శాతాన్ని మాత్రమే పరిగణనలోకి తీసుకోవాలన్న అంశంపై బోర్డు సమావేశంలో ఏకాభిప్రాయం కుదరనందున నిర్ణయం తీసుకోలేదని ఆ లేఖలో స్పష్టం చేశారు.

## సచివాలయానికి జాతీయ అవార్డు

హైదరాబాద్, మార్చి 15 (నమస్తే తెలంగాణ): దేశవ్యాప్తంగా అత్యుత్తమ భద్రతా ప్రమాణాలు పాటించిన బృహత్ భవనంగా డాక్టర్ బీఆర్ అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయం గుర్తింపు సాధించింది. ఈ మేరకు సచివాలయ నిర్మాణ సంస్థ షాపూర్జీ పల్లోంజీ సంస్థకు నేషనల్ సేఫ్టీ కౌన్సిల్ 'సేఫ్టీ అవార్డు-2023' ప్రకటించింది. శుక్రవారం హైదరాబాద్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో ఈ అవార్డును అందజేసింది. ఆర్‌అండ్‌బీ శాఖ ఈఎన్సీ గణపతిరెడ్డి, నిర్మాణ సంస్థ రీజినల్ హెడ్ లక్ష్మణ్ అగర్వాల్ ఈ వార్డును అందుకున్నారు. నిరుడు ఎలాంటి ప్రమాదాలు జరగని, అత్యుత్తమ భద్రతా ప్రమాణాలు పాటించిన మెగా ప్రాజెక్టుగా సచివాలయం గుర్తింపు సాధించింది.

## లైసెన్స్ రెన్యూవల్‌కు లక్ష లంచం

### ఏసీబీకి రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడ్డ వాటర్‌వర్క్స్ ఉద్యోగులు

సిటీబ్యూరో, మార్చి 15 (నమస్తే తెలంగాణ): లైసెన్స్ రెన్యూవల్ చేయడంతోపాటు పెండింగ్ బిల్స్ ఇవ్వడానికి లక్ష రూపాయల లంచం తీసుకుంటూ శుక్రవారం ఖైరతాబాద్‌లోని వాటర్‌వర్క్స్ రెవెన్యూ అధికారి, అతని వద్ద పనిచేసే ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి ఏసీబీ అధికారులకు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడ్డారు. ఏసీబీ అధికారుల కథనం ప్రకారం.. ఎల్ రాకేశ్ ఖైరతాబాద్‌లోని వాటర్‌వర్క్స్‌లో ఫైనాన్స్ అండ్ అకౌంట్స్ సెక్షన్‌లో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్నారు. అతని వద్ద సందీప్ అనే వ్యక్తి ఔట్‌సోర్సింగ్ విధానంలో పనిచేస్తున్నారు. ఇదిలావుండగా.. జనవరి, ఫిబ్రవరికి సంబంధించి పెండింగ్ బిల్స్‌తోపాటు పాత లైసెన్స్ రెన్యూవల్ కోసం అక్బర్ హుస్సేన్ వాటర్‌వర్క్స్ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నాడు. ఈ క్రమంలోనే పని పూర్తి చేయాలంటే రూ.లక్ష ఇవ్వాలని అక్బర్ హుస్సేన్‌ను ఇద్దరు ఉద్యోగులు డిమాండ్ చేశారు. ఈ విషయమై బాధితుడు ఏసీబీ సిటీ రేంజ్-1 యూనిట్ అధికారులకు ఫిర్యాదు చేశాడు. శుక్రవారం బాధితుడు లక్ష నగదును రాకేశ్‌కు అందించాడు. వాటిని ఆయన ఔట్‌సోర్సింగ్ ఉద్యోగికి ఇస్తుండగా ఏసీబీ అధికారులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకొని కోర్టులో హాజరుపర్చారు.

## ముస్లింలు, క్రిస్టియన్ల అభ్యున్నతికి కృషి

- ముస్లింలకు ఇఫ్తార్ విందులో సీఎం రేవంత్‌రెడ్డి
- పాల్గొన్న డిప్యూటీ సీఎం భట్టి, మంత్రులు శ్రీధర్‌బాబు, పొంగులేటి

హైదరాబాద్, మార్చి 15 (నమస్తే తెలంగాణ): కాంగ్రెస్ ప్రభుత్వం ముస్లిం, క్రిస్టియన్ మైనార్టీల అభ్యున్నతికి కృషి చేస్తుందని సీఎం రేవంత్‌రెడ్డి చెప్పారు. హైదరాబాద్ ఎల్బీ స్టేడియంలో శుక్రవారం ముస్లింలకు ఇచ్చిన ఇఫ్తార్‌విందు కార్యక్రమంలో ఆయన పాల్గొని ముస్లింలకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హయాంలో ముస్లింలకు నాలుగు శాతం రిజర్వేషన్లను అమలు చేసిన ఘనత కాంగ్రెస్ పార్టీదేనని చెప్పారు. ముస్లింల రిజర్వేషన్లను ప్రధాని మోదీ, హోంశాఖ మంత్రి అమిత్‌షా రద్దు చేస్తామని అంటున్నారని, ఇది వారి వల్ల కానే కాదని తేల్చిచెప్పారు. కార్యక్రమంలో డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు శ్రీధర్‌బాబు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ, మైనార్టీ గురుకుల కార్యదర్శి ఐసా మస్రత్ ఖానం, ముస్లిం మత పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

## • మురళీకృష్ణుడిగా లక్ష్మీనారసింహుడు



యాదగిరిగుట్ట బ్రహ్మోత్సవాలు ఐదోరోజుకు చేరుకున్నాయి. శుక్రవారం స్వామివారు శ్రీకృష్ణావతారం (మురళీకృష్ణుడు)లో దర్శనమిచ్చారు. రాత్రి ప్రధానాలయంలో నిత్యకైంకర్యాల అనంతరం స్వామివారిని పొన్న వాహనంపై ఊరేగించారు. - యాదగిరిగుట్ట


